## అంతర్జాతీయ మహిళా దినోత్సవ స్ఫూర్తితో మహిళ లోకం ఉద్యమించాలి ..



**పెద్దపల్లి, మంథని, మార్చి 06( వార్త సంధ్య ) :** మంథని కోర్టులోని బార్ అసోసియేషన్ హాల్లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రముఖ న్యాయవాదులు కే. రగోత్తం రెడ్డి, సువర్ణ చంద్రశేఖర్,ఐద్వా మహిళా సంఘం జిల్లా కార్యదర్శి ఏ మహేశ్వరి, సిఐటియు శ్రామిక మహిళ జిల్లా కన్వీనర్ జి.జ్యోతి హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవం వేడుక కాదని అది ఒక సుదీర్ఘ పోరాటాల ఫలితం అని అన్నారు. 1901 లో కోఫెన్ హేగన్ లో జరిగిన రెండవ అంతర్జాతీయ సోషలిస్టు సదస్సులో క్లారా జెట్కిన్ చేసిన ప్రతిపాదన మేరకు అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుపుకోవడం ప్రారంభమైందని అన్నారు.1857 మార్చి 8న న్యూయార్క్ లోని గార్మెంట్ కార్మికులు 10 గంటల పని దినం మరియు మెరుగైన వేతనాల కోసం తొలిసారిగా వీధుల్లోకి వచ్చి పోరాడారని అలాగే 1908 మార్చి 8న 30 వేలమంది మహిళా కార్మికులు పనిచేస్తూ ఆకలితో చావడం కంటే పోరాడుతూ ఆకలితో చావడమే మేలు అనే నినాదంతో భారీ ప్రదర్శన నిర్వహించారని అన్నారు. ఇలా సుదీర్ఘ పోరాటాలకు చిహ్నంగా వచ్చిన అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవాన్ని దురదృష్టవశాత్తు నేటి పాలకులు కార్పొరేట్ సంస్థలు మార్చి 8 రోజును కేవలం వ్యాపార ప్రకటనలకు వస్తువుల అమ్మకాలకు అందాల పోటీలకు పరిమితం చేస్తూ మహిళా దినోత్సవ వర్గ పోరాట స్ఫూర్తిని నీరుగారిస్తున్నారని విమర్శించారు. మహిళలపై జరుగుచున్న అన్యాయాలపై లింగ వివక్ష పై దోపిడీకి వ్యతిరేకంగా మహిళలకు సమాన హక్కులకై మహిళాలోకం చైతన్యవంతమై ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బూడిద గణేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఆర్ల సందీప్, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు గొర్రెంకల సురేష్, కెవిపిఎస్ జిల్లా నాయకులు మంథని లింగయ్య, విద్యార్థులు కార్మికులు పాల్గొన్నారు.

## మామిడి రైతులకు ప్రభుత్వం తోడ్పాటు ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)



**కృష్ణాజిల్లా బ్యూరో మార్చి 06 వార్త సంధ్య :** విస్సన్నపేట ,మామిడి రైతులకు ప్రభుత్వం అన్నివిధాలుగా తోడ్పాటునందిస్తుందని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. విస్సన్నపేటలో నూతనంగా ఏర్పాటు చేసిన మామిడి ఎక్స్‌పోర్టు దుకాణంను శుక్రవారం ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) ప్రారంభించారు. ఈ సందర్భంగా మామిడి సాగు గురించి ముందుగా తెలుసుకున్న ఎంపీ, మామిడి ధరలు ఈ ఏడాది ఏ విధంగా ఉన్నాయో వ్యాపారులను అడిగి తెలుసుకున్నారు. మామిడి రైతులకు గిట్టుబాటు ధర లభించేలా ప్రభుత్వం చూస్తుందని తెలిపారు. మామిడి సాగులో ఉద్యానవనశాఖ సూచనలను రైతులంగా పాటిస్తే సాగు బాటుందని అన్నారు. మామిడి సాగు క్రమంలో కాయకు ఫ్రూట్ కవర్ వేయడం ద్వారా చీడపీడల నుంచి విముక్తి లభించి కాయ నాణ్యంగా పెరుగుతుందని, రైతులకు మంచి ధర లభిస్తుందన్నారు. పార్లమెంట్ లో తాను ఫ్రూట్ కవర్ల జీఎస్టీ, సబ్సిడీ అంశం ప్రస్తావించటం వల్లే కేంద్ర ప్రభుత్వం 50 శాతం సబ్సిడీకి అందిస్తుందన్నారు.మామిడి వ్యాపారులకు, రైతులకు ఈ ఏడాది అంతా మంచి జరగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా తెలుగురైతు అధ్యక్షులు చెరుకూరి రాజేశ్వరరావు , జిల్లా సీనియర్ నాయకులు తాళ్లూరి రామారావు , ఎన్టీఆర్ జిల్లా టిడిపి మాజీ ఉపాధ్యక్షుడు నెక్కలపు శ్రీను (డాబా శ్రీను), విస్సన్న పేట మండల పార్టీ అధ్యక్షుడు రాయల సుబ్బారావు, ఎన్.ఆర్.ఐ నాయకులు వల్లభనేని గిరి, మారెమ్మ ఆలయ ట్రస్టు బోర్డు ఛైర్మన్ తేర్ల శ్రీనివాసరావు , ఎన్టీఆర్ జిల్లా టిడిపి కోశాధికారి నాదెళ్ల నాగమణి, రాష్ట్ర లీగల్ సెల్ కార్యదర్శి కొత్తపల్లి ఆనంద్ స్వరూప్, గ్రామ పార్టీ అధ్యక్షులు అరిగే శ్రీనివాసరావు, గంపల గూడెం మండలం పార్టీ అధ్యక్షుడు మానికొండ రామకృష్ణ (ఎమ్.ఆర్.కె) విస్సన్నపేట పట్టణ అధ్యక్షులు కొంగల శ్రీనివాసరావు, తిరువూరు పట్టణ పార్టీ అధ్యక్షుడు మల్లెల శ్రీనివాసరావు , తెలుగుయువత రాష్ట్ర నాయకులు కవులూరి రాజా ,జిల్లా నాయకులు ఆకుల రాధాకృష్ణ, తిరువూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు కుక్కడపు నాగేశ్వరరావు. సొసైటీ అద్యక్షుడు కంభంపాటి బద్రినాధ్,మండల తెలుగు యువత నాయకులు ముత్తం శెట్టి వంశీ, టిడిపి సీనియర్ నాయకులు ఎన్.టి వెంకటేశ్వరరావు, విస్సన్న పేట టౌన్ పార్టీ మాజీ అధ్యక్షుడు చిన్నోడు, తెలుగు యువత నాయకులు రాయల కిట్టు, మాజీ ఎంపిపి ముత్తంశెట్టి వెంకటేశ్వరరావు, తెలుగు యువత నాయకులు తుమ్మలపల్లి అనిల్, తుమ్మలపల్లి సునీల్ , మాజీ ఎంపిపి గద్దె వెంకటేశ్వరరావు, మాజీ ఎంపిటిసి కావూరి బాబు,జెడ్పీటిసీ మాజీ సభ్యులు మట్టా వేణుగోపాలరావు, టిడిపి దళిత నాయకులు బొద్దుకోళ్ల ప్రేమరాజ లతో పాటు ఎన్డీయే కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మార్చి 10న గ్రేట్ మిలియన్ మార్చ్ డే విజయవంతం చేయాలని ప్రొఫెసర్ కోదండరామ్ పిలుపు



**హైదరాబాద్ మార్చి 06(వార్త సంధ్య ):** తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలను సాధించుకునేందుకు మార్చి 10న నిర్వహించనున్న గ్రేట్ మిలియన్ మార్చ్ డేను విజయవంతం చేయాలని తెలంగాణ ఉద్యమ నేత ప్రొఫెసర్ కోదండరామ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి సంబంధించి "ఛలో గన్ పార్క్" పోస్టర్‌ను శుక్రవారం (మార్చి 6, 2026) హైదరాబాద్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారులు ఐక్యంగా పాల్గొని మిలియన్ మార్చ్ స్ఫూర్తిని చాటాలని కోరారు. మార్చి 10న ఉదయం 10:30 గంటలకు హైదరాబాద్‌లోని గన్ పార్క్ వద్ద ఉన్న తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద అందరూ కలిసి అమరులకి నివాళులు అర్పిద్దామని పిలుపునిచ్చారు. తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలను గుర్తుచేసుకుని వాటి సాధనకు కట్టుబడాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమం తెలంగాణ ఉద్యమకారుల జాయింట్ యాక్షన్ కమిటీ (టీయూజేఏసీ) రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల ప్రపుల్ రాంరెడ్డి అధ్యక్షతన జరిగింది. కార్యక్రమంలో టీయూజేఏసీ ప్రధాన కార్యదర్శి కళ్ళెపు చంద్రన్న ప్రసాద్, ఉపాధ్యక్షురాలు ఓగిరాల సుజ్జి, సీనియర్ ఉద్యమకారిణి జానకిరెడ్డి, బి. రాణి, కల్లెపు నర్సయ్య, వి. చంద్రయ్య, కనకం అంజినేయులు, రాజు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా తెలంగాణ ప్రాంతీయ ఉద్యమ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గూండా యాదగిరి, గౌరవ రాష్ట్ర అధ్యక్షుడు వి. పాండు గౌడ్, కోషాధికారి గౌరీ గణేష్ తదితరులు కూడా హాజరయ్యారు. మార్చి 10న ఉదయం 10:30 గంటలకు గన్ పార్క్ వద్ద జరిగే ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారులు, ప్రజాసంఘాలు, తెలంగాణాభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని తెలంగాణ అమరవీరులను స్మరించుకోవాలని, తెలంగాణ హక్కుల దినంగా పాటించాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.

## అంతర్జాతీయ మహిళా దినోత్సవ వార్షికోత్సవాలు

- దంతాలపల్లి మండలం ఆగ పేట తండా
- అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని
- పోరాట దినాలుగా జరుపుకుందాం

పి.ఓ.డబ్ల్యూ తొర్రూర్ డివిజన్ కార్యదర్శి ఉపేంద్ర




**వార్త సంధ్య, దంతాలపల్లి మార్చి 6:** మార్చి 1 నుండి 8 వరకు అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలను పోరాట దినాలుగా నిర్వహించాలని ప్రగతిశీల మహిళా సంఘం (గూఆ) తొర్రూర్ డివిజన్ కమిటీ పిలుపునిచ్చింది. ఈ సందర్భంగా మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలం ఆగపేట తండాలో జరుగుతున్న ఉపాధి హామీ పని స్థలాన్ని సందర్శించి మహిళా కూలీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పి.ఓ.డబ్ల్యూ తొర్రూర్ డివిజన్ కార్యదర్శి ఉపేంద్ర మాట్లాడుతూ మహిళల అభివృద్ధి భద్రత గురించి ప్రభుత్వాలు పెద్ద పెద్ద మాటలు చెప్పుతున్నప్పటికీ వాస్తవ పరిస్థితుల్లో మహిళలపై జరుగుతున్న అన్యాయాలను అరికట్టడంలో పూర్తిగా విఫలమవుతున్నాయని విమర్శించారు. ఒకవైపు మహిళల భద్రతకు సరైన చర్యలు తీసుకోకుండా మరోవైపు అందాల పోటీలు ఆర్భాట కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇవ్వడం ప్రభుత్వాల ద్వంద్వ వైఖరికి ఉదాహరణ అని అన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి దాదాపు ఏడు దశాబ్దాలు గడిచినా నేటికీ మహిళలపై వివక్షత లైంగిక దాడులు కుటుంబ హింస కార్యాలయ వేధింపులు కొనసాగుతూనే ఉన్నాయని ఉపేంద్ర ఆవేదన వ్యక్తం చేశారు. పితృస్వామ్య వ్యవస్థతో పాటు దోపిడీ పాలక వర్గాల విధానాలు మహిళలను రెండింతల అణచివేతకు గురి చేస్తున్నాయని అన్నారు. మహిళల శ్రమను చౌకగా వినియోగించుకుంటూ సమాన వేతనం ఇవ్వకుండా దోపిడీ కొనసాగిస్తున్నారని విమర్శించారు. ప్రత్యేకంగా గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పనుల్లో పనిచేసే మహిళలు తక్కువ వేతనాలు అసురక్షిత పరిస్థితులు సౌకర్యాల లేమితో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పని ప్రదేశాల్లో తాగునీరు విశ్రాంతి స్థలం చిన్నారుల సంరక్షణ వంటి కనీస సౌకర్యాలు కూడా లేకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. మహిళలకు అన్ని రంగాల్లో సమాన హక్కులు సమాన వేతనం కల్పించాలని లైంగిక దాడులపై కఠిన చర్యలు తీసుకోవాలని మహిళల భద్రతకు బలమైన చట్టాలను అమలు చేయాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. మహిళలపై జరుగుతున్న అన్యాయాలకు వ్యతిరేకంగా మహిళలు సమిష్టిగా సంఘటితమై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని కేవలం పండుగలా కాకుండా మహిళా విముక్తి కోసం పోరాట దినంగా మార్చుకోవాలని, గ్రామాలు, తండాలు, పనిస్థలాల్లో మహిళలను చైతన్యపరుస్తూ కార్యక్రమాలు నిర్వహించాలని ప్రగతిశీల మహిళా సంఘం పిలుపునిచ్చింది. ఈ కార్యక్రమంలో రంజిత్, సురేష్, కమల్, తేజు, గుగులోతు తాగులీ, హరి, మంగ్య, బద్రు కిరణ్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## దుబ్బాకలో కొత్త బస్సు సర్వీసులు ప్రారంభం





**దుబ్బాక మార్చి 06 ( వార్త సంధ్య ) :** దుబ్బాక బస్ డిపోలో బస్సుల సంఖ్య పెంచాలని మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావు ఆర్టీసీ ఎండీని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఎంపీ కృషి ఫలితంగా గత వారం వేములవాడ, చేగుంట రూట్లలో మూడు కొత్త బస్సు సర్వీసులు ప్రారంభమైన



సంగతి తెలిసిందే. తాజాగా దుబ్బాక కొత్తపల్లి కామారెడ్డి రూట్‌లో మరో మూడు బస్సు సర్వీసులను శుక్రవారం ప్రారంభించారు. ఈ బస్సు సర్వీసులను బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో ప్రారంభించారు. దుబ్బాక బస్ డిపోను అన్ని విధాలుగా అభివృద్ధి చేయడానికి కృషి చేస్తున్నామని ఎంపీ రఘునందన్ రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అంబటి బాలేష్ గౌడ్, దుబ్బాక నియోజకవర్గ ఇంచార్జ్ ఎస్.ఎన్. చారి, జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు సత్తు తిరుమల రెడ్డి, దుబ్బాక మున్సిపల్ అధ్యక్షుడు దోరగొల్ల శ్రీకాంత్ యాదవ్, మున్సిపల్ కౌన్సిలర్ మెరుపుల సాయి కుమార్ గౌడ్, గంభీర్పూర్‌కు చెందిన కనకరాజు, బీజేపీ నాయకులు కాపరబోయిన శ్రీనివాస్, కారంకంటి రాజు, పెంటం మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత పేషంట్ పార్కింగ్ ప్రారంభం





**హైదరాబాద్ సిటీ ప్రతినిధి ( వార్త సంధ్య) మార్చి 6 :** నిలోఫర్ ఆసుపత్రిలో ఉచిత పేషెంట్ పార్కింగ్ సదుపాయం ప్రారంభం నిలోఫర్ ఆసుపత్రి ప్రాంగణంలో రోగుల సౌకర్యార్థం నూతనంగా ఏర్పాటు చేసిన 'ఉచిత పార్కింగ్' సదుపాయాన్ని నాంపల్లి శాసనసభ్యులు (ఎమ్మెల్యే) మహమ్మద్ మజీద్ హుస్సేన్ ఈ రోజు ముఖ్య అతిథిగా విచ్చేసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విజయ్ కుమార్, సీ.ఎస్.ఆర్.ఎం.ఓ డాక్టర్ ఆనంద్, అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీమతి సుధా చంద్రిక, డిప్యూటీ సీ.ఎస్.ఆర్.ఎం.ఓ డాక్టర్ నాగజ్యోతి, డిప్యూటీ సీ.ఎస్.ఆర్.ఎం.ఓ డాక్టర్ శంకర్ ఇతర ఆర్.ఎం.ఓ లు పాల్గొన్నారు. ఆసుపత్రి అడ్మినిస్ట్రేషన్ సిబ్బందితో పాటు, ఎం.పి.హెచ్.ఇ.ఓ శ్రీనివాస్ ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా సమన్వయం చేశారు. అనంతరం ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీ మజీద్ హుస్సేన్ మాట్లాడుతూ.. ఆసుపత్రికి వచ్చే రోగులు, వారి బంధువుల సౌకర్యం కోసం ఒకేసారి సుమారు 300 ద్విచక్ర వాహనాలు (టూ-వీలర్స్) నిలిపే సామర్థ్యంతో ఈ ఉచిత పార్కింగ్ స్థలాన్ని అందుబాటులోకి తీసుకురావడం హర్షణీయమన్నారు. ఈ నూతన సదుపాయం వల్ల ఆసుపత్రి వెలుపల ట్రాఫిక్ రద్దీ గణనీయంగా అదుపులోకి వస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. రోగుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా చేపట్టినందుకు గానూ ఆసుపత్రి సూపరింటెండెంట్ సీ.ఎస్.ఆర్.ఎం.ఓ లను ఆయన ప్రత్యేకంగా అభినందించారు

## 56వ డివిజన్లో పారిశుధ్య కార్యక్రమం పర్యవేక్షించిన కార్పొరేటర్ శాంతిప్రియ




**కొత్తగూడెం కార్పొరేషన్, మార్చి 06 (వార్త సంధ్య) :** ప్రజాపాలన కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం 56వ డివిజన్ వ్యాప్తంగా పారిశుధ్య కార్యక్రమాలను నిర్వహించారు. డివిజన్ వ్యాప్తంగా ఉన్న కాల్వలను కార్పొరేషన్ శానిటేషన్ సిబ్బంది శుభ్రపరుస్తున్నారు. అదే విధంగా పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించడంతో పాటు దోమల నివారణకు ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టారు. ఈసందర్భంగా శాంతిప్రియ మాట్లాడుతూ పరిశుభ్రతే ప్రధానంగా కార్య క్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మురుగు కాల్వల్లో నీరు నిల్వ ఉండకుండా కాల్వలను శుభ్రం చేయించడం ద్వారా దోమల బెడద తప్పుతుందని చెప్పారు. డివిజన్ వ్యాప్తంగా పారిశుధ్య కార్యక్రమాలు అనునిత్యం నిర్వహిస్తూ మోడల్ డివిజన్గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని, ఇందుకు అధికారులు సహా య సహకారాలు అందిస్తున్నారని చెప్పారు. డివిజన్లో ఏ సమస్య తలెత్తినా తనను నేరుగా సంప్రదించాలని, ఆ సమస్యను వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు ఆఫీసర్ సంధ్య, జవాన్ నవీన్, 56వ డివిజన్ కార్యదర్శి గడ్డం సతీష్ బాబు, రమాదేవి, శారద తదితరులు పాల్గొన్నారు.

## మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా 12న తిరువూరులో ర్యాలీ



**తిరువూరు మార్చి 06 (వార్తసంధ్య) : తిరువూరు:** మత్తు పదార్థాల వినియోగాన్ని అరికట్టడం మరియు యువతలో అవగాహన పెంచే లక్ష్యంతో ఈ నెల 12వ తేదీన తిరువూరులో భారీ అవగాహన ర్యాలీ నిర్వహించనున్నట్లు వైబ్రెంట్స్ ఆఫ్ కలాం సంస్థ కన్వీనర్ దుబ్బాకు ఆనందరావు తెలిపారు. తిరువూరు బైపాస్ రోడ్డులోని జంక్షన్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ఉదయం 10 గంటలకు ర్యాలీ నిర్వహించనున్నారు. ర్యాలీ అనంతరం మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా మానవహారం ఏర్పాటు చేయనున్నట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో తిరువూరు పట్టణంలోని విద్యాసంస్థల విద్యార్థులు, వెలుగు మరియు మెప్మా సభ్యులు, ఎన్జీవోలు, ప్రజాప్రతినిధులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. విద్యార్థులు, యువత మత్తు పదార్థాలకు బానిసలవుతూ తమ విలువైన జీవితాలను కోల్పోతున్న పరిస్థితి ఆందోళన కలిగిస్తోందని తిరువూరు ఇన్‌చార్జ్ ఆర్డీవో పోసి బాబు తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహించే ఈ అవగాహన ర్యాలీలో ప్రతి ఒక్కరూ పాల్గొని మత్తు పదార్థాల వ్యతిరేకంగా సమాజంలో చైతన్యం తీసుకురావాలని ఆయన పిలుపునిచ్చారు.

## సిండికేట్ పేరుతో అధిక ధరలకు మద్యం అమ్మకాలు

- గ్రామాల్లోని దుకాణాల్లో అనధికార తనిఖీలు ,
- దౌర్జన్యం చేస్తూ మహిళల ముందు దురుసు ప్రవర్తన
- రైడింగ్ లకు ప్రత్యేక టీంలు ఏర్పాటు చేసుకున్న మద్యం వ్యాపారులు




**యాదాద్రి భువనగిరి జిల్లా, మార్చ్ 06(వార్త సంధ్య) :** యాదాద్రి భువనగిరి జిల్లా, గుండాల మండల కేంద్రంలో గల రెండు మద్యం షాపులు సిండికేట్ అయి తమ ఇష్టా రాజ్యంగా ఎమ్మార్పీ ధర కన్నా అధికంగా రేట్లు పెంచి సామాన్యుడి జేబుకు చిల్లు పెడుతున్నారు, అధిక ధరలకు మద్యం అమ్మి లక్షలు దండుకుంటున్నారు, హోల్ సేల్ పేరుతో గ్రామాల్లోని దుకాణాల వద్దకు వెళ్లి మద్యం కొనాలని ప్రోత్సహించి ఇప్పుడు సిండికేట్ పేరుతో వారికి అధిక ధరలకు మద్యం అమ్ముతున్నారు , అధిక ధరకు కొన్న మద్యం సీసాలకు వాళ్ళ షాపు స్టికర్ అంటించి ఇస్తున్నారు, ఒకవేళ మద్యం కొనకపోతే మరల వారి వద్ద కొనాలని ఒత్తిడి చేస్తున్నారు , చెకింగ్ పేరుతో గ్రామాల్లోని దుకాణాల వద్దకు వెళ్లి జుగుప్సాకరమైన వాతావరణాన్ని సృష్టించి , భయపడేలా దుకాణాదారులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు, ఇంట్లో ఆడవాళ్ళు ఉన్నా కూడా తనిఖీల పేరుతో ఇల్లంతా కలియతిరుగుతూ సోదాలు చేస్తున్నారు, వారించిన మహిళల మీద దురుసుగా ప్రవర్తిస్తున్నారు, పరువు కోసం బయట చెప్పుకోలేని మహిళలు లోలోపల కుమిలిపోతున్నారు ఇలా మండలంలోని 20 గ్రామాల్లో తిరుగుతూ దుకాణాదారులను మానసిక వేదనకు గురి చేస్తున్నారు మద్యం నిర్వాహకులు, ఇదేమిటి అని ప్రశ్నించిన వారికి కూడా దురుసుగా సమాధానం చెప్తున్నారు , బెదిరింపులకు పాల్పడుతున్నారు మండల కేంద్రం లోని మద్యం వ్యాపారులు ,మాకు అధికారుల సపోర్ట్ ఉంది అంటూ రెచ్చిపోతుంది మద్యం సిండికేట్ మాఫియా , ఇలా ప్రజల ఇళ్లలో అనధికార తనిఖీలు చేసే అధికారం ఎవరిచ్చారు ఈ మద్యం వ్యాపారులకు , ప్రశ్నించిన వారి మీదకు ఎక్సైజ్ అధికారుల చేత ఇంటి మీద దాడులు నిర్వహించేలా చేస్తున్నారు , అలాంటి సంఘటనలు కూడా జరిగాయి , మరి సిండికేట్ మద్యం మాఫియా ఆగడాలు ఆగేదెన్నడు అరికట్టేదేవరు.

## భార్యను హత్య చేసిన కేసులో భర్తకు జీవిత ఖైదు



**కొత్తగూడెం లీగల్, మార్చి 06 ( వార్త సంధ్య ) :** భార్యను హత్య చేసిన కేసులో భర్తకు జీవిత ఖైదు విధిస్తూ కొత్తగూడెం జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ శుక్రవారం తీర్పు వెలు వరించారు. కేసు వివరాల ప్రకారండ చుంచుపల్లి మండలం విద్యానగర్‌కు చెందిన లాకవత్ సైదులు తన పెద్ద కూతురు స్నేహాను 2021 జూలై 30న మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం పుల్లూరు గ్రామం కట్టుకుంట తండాకు చెందిన భూక్య శ్రీధర్‌కు వివాహం చేశారు. వివాహం అనంతరం కొద్ది రోజుల వరకు సజావుగానే సాగిన దాంపత్య జీవితం తరువాత భర్తతో పాటు అత్తమామల వేధింపులు ప్రారంభమైనట్లు తెలిసింది. వేధింపులు భరించలేక స్నేహా పుట్టింటికి వచ్చినప్పటికీ కుటుంబ సభ్యులు సర్దిచెప్పి తిరిగి పంపించారు. అయినప్పటికీ పరిస్థితిలో మార్పు రాకపోవడంతో ఆమె కొంతకాలంగా పుట్టింటి వద్దే ఉంటూ ఉండేది. 2023 మే 20న ఉదయం సుమారు 11 గంటల సమయంలో భూక్య శ్రీధర్ పెట్రోల్ తీసుకువచ్చి స్నేహాపై పోసి నిప్పంటించాడు. ఈ ఘటనను గమనించిన స్నేహా చెల్లి నీల పక్కింటి లక్ష్మీనారాయణ ఫోన్ ద్వారా తన తల్లికి సమాచారం ఇచ్చింది. వెంటనే కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకుని తీవ్ర గాయాలతో ఉన్న స్నేహాను ఆస్పత్రికి తరలించి చికిత్స అందించినప్పటికీ ఆమె మృతి చెందింది. ఈ ఘటనపై స్నేహా తండ్రి లాకవత్ సైదులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు చుంచుపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. అప్పటి ఎస్సై కె. సుమన్ కేసు నమోదు చేయగా, ఇన్‌స్పెక్టర్ ఏ. రమాకాంత్ దర్యాప్తు చేసి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. కోర్టులో మొత్తం 17 మంది సాక్షులను విచారించగా భూక్య శ్రీధర్‌పై నేరం రుజువైంది. దీంతో అతనికి జీవిత ఖైదు శిక్షతో పాటు రూ.1000 జరిమానా విధిస్తూ, జరిమానా చెల్లించని పక్షంలో మరో 6 నెలల జైలు శిక్ష విధించారు. అయితే అత్త భూక్య అచ్చమ్మ, మామ భూక్య బాసు ఏ భాస్కర్‌లపై నేరం రుజువు కాలేదని కోర్టు వారిని విముక్తి కల్పించింది. ఈ కేసును అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ పి.వి.డి. లక్ష్మి వాదించారు. కోర్టు నోడల్ ఆఫీసర్ ఎస్సై డి. రాఘవయ్య, కోర్టు లైజాన్ ఆఫీసర్ ఎన్. వీరబాబు (కోర్టు డ్యూటీ ఆఫీసర్), హెచ్‌సీలు లచ్చూ, పి. సుమన్ తదితరులు సహకరించారు.

# షాపింగ్, వెల్‌నెస్, గ్యాస్ట్రోనమీ హైదరాబాద్ బ్రాండింగ్ మార్చబోతున్న మూడు కీలక స్తంభాలు



తెలంగాణ రాజధాని హైదరాబాద్ అంటే కేవలం ఐటీ కంపెనీలు, చారిత్రక కట్టడాలు మాత్రమే కాదు.. ఇప్పుడు ఈ నగరం ప్రపంచ స్థాయి పర్యాటక కేంద్రంగా రూపాంతరం చెందుతోంది. పర్యాటక రంగంలో హైదరాబాద్ కీర్తిని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లేందుకు తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ ఒక భారీ బ్రాండింగ్ వ్యూహాన్ని రూపొందించింది. గ్యాస్ట్రోనమీ (ఆహార సంస్కృతి), వెల్నెస్ (ఆరోగ్యం, ఆధ్యాత్మికత), ప్రీమియం షాపింగ్ అనే మూడు ప్రధాన స్తంభాల ఆధారంగా ఒక 'టూరిజం ట్రయాంగిల్'ను అధికారులు ఆవిష్కరించారు. 1. గ్యాస్ట్రోనమీ: ప్రపంచానికి రుచి చూపించే హైదరాబాద్ హైదరాబాద్ పేరు వినగానే మనకు మొదట గుర్తొచ్చేది బిర్యానీ. అయితే కేవలం బిర్యానీకే పరిమితం కాకుండా.. ఇక్కడి విభిన్నమైన ఆహార సంస్కృతిని ప్రపంచవ్యాప్తం చేయాలని అధికారులు నిర్ణయించారు. పాతబస్తీలోని సంప్రదాయ వంటకాల నుంచి నేటి మోడరన్ ఫైన్ డైనింగ్ అనుభవాల వరకు పర్యాటకులకు పరిచయం చేయడమే ఈ వ్యూహం ముఖ్య ఉద్దేశ్యం. గ్లోబల్ క్యాంపెయిన్ల ద్వారా విదేశీ పర్యాటకులు నగరానికి వచ్చి, ఇక్కడి రుచులను ఆస్వాదించేలా ప్రత్యేకంగా క్యూరేటెడ్ ఫుడ్ టూర్లను ప్లాన్ చేస్తున్నారు. 2. వెల్నెస్: మానసిక ప్రశాంతతకు కేరాఫ్ అడ్రస్ రెండవ కీలక స్తంభం 'వెల్నెస్'. నేటి ఒత్తిడితో కూడిన ప్రపంచంలో పర్యాటకులు ఆధ్యాత్మిక , మానసిక ప్రశాంతతను కోరుకుంటున్నారు. హైదరాబాద్ చుట్టుపక్కల ఉన్న మెడిటేషన్ సెంటర్లు, హోలిస్టిక్ హీలింగ్ కేంద్రాలు , ఆధ్యాత్మిక రిట్రీట్లను ఈ బ్రాండింగ్ ద్వారా ప్రమోట్ చేయనున్నారు. ముఖ్యంగా కన్హా శాంతి వనం వంటి గ్లోబల్ మెడిటేషన్ హబ్‌లు ఈ వెల్నెస్ టూరిజంలో ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయి. యోగా, ధ్యానం , ఆయుర్వేద చికిత్సల కోసం వచ్చే అంతర్జాతీయ పర్యాటకుల సంఖ్యను పెంచడమే దీని లక్ష్యం. 3. ప్రీమియం షాపింగ్: పాతబస్తీ నుంచి హైటెక్ సిటీ వరకు మూడవది షాపింగ్. హైదరాబాద్ నగరం తన ముత్యాలు, చేనేత వస్త్రాలు , హస్తకళలకు ప్రపంచ ప్రసిద్ధి చెందింది. లాడ్ బజార్‌లోని గాజులు, గద్వాల , పోచంపల్లి చీరలు, బిద్రీ కళాఖండాలను ప్రదర్శించడంతో పాటు.. హైటెక్ సిటీ , జూబ్లీహిల్స్‌లో ఉన్న ఆధునిక మాల్స్ , లగ్జరీ రిటైల్ బ్రాండ్‌లను పర్యాటకులకు చేరువ చేయనున్నారు. సంప్రదాయం , ఆధునికత కలగలిసిన షాపింగ్ అనుభవాన్ని పర్యాటకులకు అందించాలని ప్రభుత్వం భావిస్తోంది. టూరిజం అభివృద్ధికి మరిన్ని చర్యలు ం+uణజ మేనేజింగ్ డైరెక్టర్ వల్లూరు క్రాంతి తెలిపిన వివరాల ప్రకారం, ఈ మూడు రంగాల్లో హైదరాబాద్కు అద్భుతమైన సామర్థ్యం ఉంది. కేవలం పర్యాటక ప్రాంతాలను చూపించడమే కాకుండా, పర్యాటకులకు ఒక 'అనుభవాన్ని' అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోంది. విదేశీ ప్రతినిధులు, ఇన్‌ఫ్లుయెన్సర్ల ద్వారా ఈ ప్రచారాన్ని మరింత ఉధృతం చేయనున్నారు. మౌలిక సదుపాయాల మెరుగుదల, చారిత్రక కట్టడాల సుందరీకరణ వంటి పనులు కూడా దీనిలో భాగంగా సాగుతున్నాయి. తద్వారా స్థానికంగా ఉపాధి పెరగడమే కాకుండా రాష్ట్ర ఖజానాకు విదేశీ మార్పిడి ఆదాయం కూడా లభిస్తుంది.

# కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు అదిరిపోయే గుడ్ న్యూస్

## జీతాలు భారీగా పెరగనున్నాయా?




కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న (ఎనిమిదో పే కమిషన్) ప్రక్రియ వేగవంతమైంది. ఫిబ్రవరి 25, 2026న న్యూఢిల్లీలో జరిగిన 'నేషనల్ కౌన్సిల్ జాయింట్ కన్సల్టేటివ్ మెషినరీ' సమావేశంలో ఉద్యోగుల భవిష్యత్తును మార్చేసే పలు కీలక అంశాలపై సుదీర్ఘ చర్చ జరిగింది. రైల్వే, డిఫెన్స్, పోస్టల్, ఇన్‌కమ్ టాక్స్ వంటి ప్రధాన విభాగాల ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొని తమ గళాన్ని వినిపించారు. ఉద్యోగుల ప్రధాన డిమాండ్లు: 5 ప్రమోషన్లు గ్యారెంటీ! చాలా కాలంగా జూనియర్ స్థాయి ఉద్యోగులు ప్రమోషన్లు లేక కెరీర్‌లో స్తబ్దతను ఎదుర్కొంటున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని, ప్రతి ఉద్యోగికి తన సర్వీస్ కాలంలో కనీసం ఐదు ప్రమోషన్లు కచ్చితంగా లభించేలా నిబంధనలు చేర్చాలని ఆల్ ఇండియా డిఫెన్స్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ సెక్రటరీ జనరల్ సి. శ్రీకుమార్ డిమాండ్ చేశారు. ఇది ప్రతిభావంతులైన యువ ఉద్యోగుల్లో ఉత్సాహాన్ని నింపుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. జీతాల వ్యత్యాసం తగ్గాలి: గరిష్ట పరిమితి 10 రెట్లు మాత్రమే! ప్రస్తుతం ఉన్న 7వ పే కమిషన్‌లో కనిష్ట, గరిష్ట ప్రాథమిక వేతనాల మధ్య వ్యత్యాసం 13 రెట్లుగా ఉంది. అయితే ఈ అంతరాన్ని తగ్గించాలని ఉద్యోగ సంఘాలు కోరుతున్నాయి. అత్యధిక జీతం పొందే అధికారి వేతనం, కనిష్ట వేతనం కంటే 10 రెట్లు మించకుండా ఉండాలని వారు ప్రతిపాదించారు. దీనివల్ల కింది స్థాయి ఉద్యోగుల ఆర్థిక స్థితిగతులు మెరుగుపడతాయని భావిస్తున్నారు. ఫ్యామిలీ యూనిట్ల పెంపు.. తల్లిదండ్రులకు కూడా మేలు! జీతాల సవరణ లెక్కల్లో ఇప్పటివరకు ఫ్యామిలీ యూనిట్లను 3 గా పరిగణించేవారు. కానీ, మారుతున్న కాలానికి అనుగుణంగా దీనిని 5కి పెంచాలని డిమాండ్ చేస్తున్నారు. దీని వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశం ఉద్యోగిపై ఆధారపడిన తల్లిదండ్రులను కూడా ఈ పరిధిలోకి తీసుకురావడం. దీనివల్ల అలవెన్సులు , ఇతర ప్రయోజనాలు మరింత పెరిగే అవకాశం ఉంది. పెన్షనర్లకు తీపి కబురు: ఫిట్‌మెంట్ ఫ్యాక్టర్‌పై చర్చ ఈ సమావేశంలో సుమారు 68 లక్షల మంది పెన్షనర్లు, ఫ్యామిలీ పెన్షనర్ల గురించి కూడా కీలక చర్చ జరిగింది. ఉద్యోగులకు వర్తింపజేసే అదే 'ఫిట్‌మెంట్ ఫ్యాక్టర్' ను పెన్షనర్లకు కూడా వర్తింపజేయాలని కోరుతున్నారు. పెన్షనర్లలో 60 శాతం మంది మాజీ సైనికులు లేదా వారిపై ఆధారపడిన వారు కావడంతో వారికి న్యాయం జరగాలని ఉద్యోగ సంఘాలు పట్టుబడుతున్నాయి. తదుపరి అడుగు ఏమిటి? మార్చి 10, 2026న మరో కీలక సమావేశం జరగనుంది. ఈ మీటింగ్‌లో ఒక ఉమ్మడి వినతిపత్రాన్ని సిద్ధం చేసి, వారం పది రోజుల్లో పే కమిషన్‌కు సమర్పించనున్నారు. అలాగే పే కమిషన్ అడిగిన 18 ప్రశ్నలకు సమాధానాలను త్వరగా పంపడం ద్వారా ప్రక్రియను వేగవంతం చేయాలని నిర్ణయించారు. దీనితో పాటు ఓల్డ్ పెన్షన్ స్కీమ్ పునరుద్ధరణపై కూడా చర్చలు కొనసాగుతున్నాయి.

# నిశ్శబ్దంగా ఉన్న బంగారం మార్కెట్

## బ్యాంకుల వ్యూహం మారింది, ఇన్వెస్టర్లు జాగ్రత్త!



గత కొన్ని ఏళ్లుగా బంగారానికి ఉన్న డిమాండ్ చూస్తుంటే.. పసిడి ధరలకు అడ్డుకైతే లేదనిపించింది. ప్రపంచవ్యాప్తంగా సెంట్రల్ బ్యాంకులు పెద్ద ఎత్తున బంగారాన్ని కొనుగోలు చేయడం దీనికి ఒక ప్రధాన కారణం. అయితే 2026 ప్రారంభంలో ఈ ధోరణిలో ఊహించని మార్పు వచ్చింది. జనవరి నెలలో సెంట్రల్ బ్యాంకుల గోల్డ్ రన్ దాదాపు 80 శాతం తగ్గిపోయిందని వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ తాజా నివేదిక వెల్లడించింది. మరి ఇది కేవలం విరామమా? లేక పసిడి పతనానికి ఆరంభమా? అనే ఆసక్తికర విషయాలు ఇప్పుడు తెలుసుకుందాం. బంగారం ధరలు ఆకాశాన్ని తాకడానికి ప్రధాన మద్దతుగా నిలిచిన సెంట్రల్‌బ్యాంకుల కొనుగోళ్లు ఒక్కసారిగా మందగించాయి. 2025లో నెలకు సగటున 27 టన్నుల బంగారాన్ని కొనుగోలు చేసిన బ్యాంకులు.. 2026 జనవరిలో కేవలం 5 టన్నుల నికర కొనుగోళ్లతో సరిపెట్టుకున్నాయి. ఇది అంతకుముందు సంవత్సరంతో పోలిస్తే 80 శాతానికి పైగా తగ్గుదల. ఈ గణాంకాలు చూస్తుంటే ఇన్వెస్టర్లలో ఒక రకమైన ఆందోళన మొదలైంది. అసలు బంగారం కొనుగోళ్లు ఇంతగా ఎందుకు పడిపోయాయో విశ్లేషించాల్సిన అవసరం ఉంది. ధరల హెచ్చుతగ్గులే ప్రధాన కారణమా? వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ విశ్లేషణ ప్రకారం, జనవరిలో బంగారం ధరలు రికార్డు స్థాయికి చేరడం, మార్కెట్‌లో నెలకొన్న అస్థిరత వల్ల బ్యాంకులు కొంత విరామం తీసుకున్నాయి. ధరలు విపరీతంగా పెరిగినప్పుడు రిజర్వ్ మేనేజర్లు కొనుగోళ్లను వాయిదా వేసి, మార్కెట్ సాధారణ స్థితికి వచ్చే వరకు వేచి చూడటం సహజం. అదీకాక జనవరి నెలలో కొన్ని బ్యాంకులు తమ ఆర్థిక ప్రణాళికల్లో బిజీగా ఉండటం కూడా ఈ మందగమనానికి ఒక కారణం కావచ్చు. అయితే ఇది కేవలం స్వల్పకాలిక మార్పేనని, దీర్ఘకాలికంగా బంగారానికి ఉన్న క్రేజ్ తగ్గదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. కొనుగోలు చేసిన దేశాలు ఏవి? అమ్మినవి ఏవి? జనవరిలో మొత్తం కొనుగోళ్లు తక్కువగా ఉన్నప్పటికీ.. కొన్ని దేశాలు మాత్రం తమ నిల్వలను పెంచుకుంటూనే ఉన్నాయి. ఉజ్బెకిస్తాన్: అత్యధికంగా 9 టన్నుల బంగారాన్ని కొనుగోలు చేసి మొదటి స్థానంలో నిలిచింది. చైనా: వరుసగా 15వ నెలలో కూడా బంగారాన్ని సేకరించింది. దీనితో ఆ దేశ నిల్వల్లో బంగారం వాటా 10 శాతానికి చేరువయ్యింది. మలేషియా, చెక్ రిపబ్లిక్: ఇవి కూడా స్వల్పంగా బంగారాన్ని తమ ఖాతాలో చేర్చుకున్నాయి. రష్యా, బల్గేరియా: మరోవైపు, రష్యా సెంట్రల్ బ్యాంక్ 9 టన్నుల బంగారాన్ని విక్రయించగా.. బల్గేరియా కూడా స్వల్పంగా అమ్మకాలు జరిపింది. యూరో కరెన్సీని స్వీకరించే క్రమంలో బల్గేరియా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. భవిష్యత్తులో బంగారం పరిస్థితి ఏంటి? కేవలం ఒక నెల డేటాను చూసి బ్యాంకులు బంగారాన్ని వదిలేస్తున్నాయని అనుకోవడం పొరపాటే అవుతుంది. డాలర్‌పై ఆధారపడటం తగ్గించుకోవడానికి, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల నుంచి తమ ఆర్థిక వ్యవస్థను కాపాడుకోవడానికి చాలా దేశాలు బంగారాన్ని ఒక సురక్షితమైన ఆస్తిగా భావిస్తున్నాయి. ముఖ్యంగా ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధం వంటి పరిస్థితుల నేపథ్యంలో సెంట్రల్ బ్యాంకులు మళ్లీ కొనుగోళ్లు ప్రారంభించే అవకాశం ఉంది. ప్రస్తుతానికి జనవరి గణాంకాలు ఒక విరామం లాంటివే తప్ప, ట్రెండ్ రివర్స్ అయినట్లు కాదు. బంగారం ధరలు కొంత స్థిరపడిన తర్వాత బ్యాంకులు మళ్లీ తమ నిల్వలను పెంచుకునే అవకాశం ఉంది. ఇన్వెస్టర్లు కూడా ప్రస్తుత ధరల ఒడిదుడుకులను గమనిస్తూ, దీర్ఘకాలిక లక్ష్యాలతో ముందుకు వెళ్లడం శ్రేయస్కరం. గ్లోబల్ మార్కెట్‌లో అస్థిరత ఉన్నంత కాలం బంగారానికి ఉన్న డిమాండ్ ఎప్పటికీ తగ్గదు.

# భారత్‌కు అమెరికా బంపర్ ఆఫర్

## చమురు సంక్షోభం నుంచి భారత్ సేఫ్



ప్రస్తుతం పశ్చిమ ఆసియాలో నెలకొన్న ఉద్రిక్తతల వల్ల ప్రపంచ చమురు మార్కెట్ గందరగోళంలో పడింది. ఇరాన్ తన వ్యూహాత్మక హోర్ముజ్ జలసంధి ప్రాంతాన్ని మూసివేయడంతో.. గ్లోబల్ ఆయిల్ సప్లైలో దాదాపు 40 శాతం వాటా కలిగిన ఈ మార్గం గుండా ఓడల రాకపోకలు ఆగిపోయాయి. ఈ విపత్కర పరిస్థితుల్లో భారత ఇంధన అవసరాలను దృష్టిలో ఉంచుకుని, రష్యా నుంచి ముడి చమురును కొనుగోలు చేసేందుకు అమెరికా ట్రెజరీ విభాగం 30 రోజుల పాటు ప్రత్యేక మినహాయింపు మంజూరు చేసింది. అమెరికా నిర్ణయం వెనుక అసలు కారణం ఏమిటి? అమెరికా ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెస్సెంట్ ఈ నిర్ణయాన్ని సామాజిక మాధ్యమం వేదికగా ప్రకటించారు. "ప్రపంచ మార్కెట్లో చమురు సరఫరా నిరంతరం కొనసాగేలా చూడటమే మా లక్ష్యం. అందుకే భారతీయ రిఫైనరీలకు రష్యా చమురును కొనుగోలు చేసేందుకు 30 రోజుల తాత్కాలిక అనుమతి ఇస్తున్నాం" అని ఆయన పేర్కొన్నారు. అయితే, ఈ మినహాయింపు కేవలం సముద్రంలో నిలిచిపోయిన రష్యా చమురు నౌకలకు మాత్రమే వర్తిస్తుంది. దీనివల్ల రష్యా ప్రభుత్వానికి పెద్దగా ఆర్థిక లాభం చేకూరదని, కేవలం ప్రస్తుత సరఫరా ఒత్తిడిని తగ్గించేందుకు తీసుకున్న 'స్టాప్-గ్యాప్' చర్య అని అమెరికా వివరించింది. జలసంధి దిగ్బంధం , భారత్ ఆందోళన భారతదేశం తన ముడి చమురు అవసరాలలో దాదాపు 40 శాతాన్ని పశ్చిమ ఆసియా దేశాల నుంచే దిగుమతి చేసుకుంటుంది. ఈ నౌకలన్నీ హోర్ముజ్ జలసంధి గుండానే ప్రయాణించాలి. ఇరాన్ ఈ మార్గాన్ని అడ్డుకోవడంతో భారత్‌లో చమురు కొరత ఏర్పడవచ్చని వార్తలు వచ్చాయి. అందుకే భారత్ తన వద్ద ఉన్న నిల్వలను కాపాడుకుంటూనే, ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా రష్యా నుంచి చమురును తెప్పించుకోవడానికి మొగ్గు చూపింది. హెచ్‌పీసీఎల్ వంటి ప్రభుత్వ రంగ సంస్థలు ఇప్పటికే మూడు నెలల విరామం తర్వాత రష్యా చమురు కొనుగోళ్లను మళ్లీ ప్రారంభించాయి. భారత్-అమెరికా సంబంధాల్లో కొత్త మలుపు గతంలో రష్యా నుంచి చమురు కొంటున్నందుకు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం భారత ఎగుమతులపై 25 శాతం సుంకం విధించిన సంగతి తెలిసిందే. అయితే, ఇటీవల జరిగిన దౌత్యపరమైన చర్చల తర్వాత ఆ ఆంక్షలను తొలగించారు. ఇప్పుడు ఇరాన్ సంక్షోభం వేళ భారత్‌ను ఒక ముఖ్యమైన భాగస్వామిగా గుర్తించిన అమెరికా, ఈ మినహాయింపును ఇవ్వడం విశేషం. దీనివల్ల భారత రిఫైనరీలకు వచ్చే ఏప్రిల్ 4వ తేదీ వరకు రష్యా చమురును క్లియర్ చేసుకునే అవకాశం లభించింది. మొత్తంగా భారత్‌లో ప్రస్తుతం పెట్రోల్, డీజిల్ రేషనింగ్ (కోత) విధించే ఆలోచన లేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. తగినంత స్టాక్ అందుబాటులో ఉందని, ఇన్వెస్టర్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అది పేర్కొంది. ఈ అమెరికా వెయివర్ వల్ల హోర్ముజ్ జలసంధి సమస్య ఉన్నప్పటికీ, రష్యా చమురు భారత్‌కు చేరుతుంది. ఇది దేశీయ మార్కెట్లో ఇంధన ధరలు స్థిరంగా ఉండటానికి , స్టాక్ మార్కెట్‌లో సానుకూల వాతావరణం ఏర్పడటానికి దోహద పడుతుంది.

# వైజాగ్ రియల్ ఎస్టేట్

## ఈ నాలుగు జోన్లలోని ప్లాట్ల కోసం ఎగబడుతున్న కొనుగోలుదారులు

### కారణం ఏంటంటే



ఆంధ్రప్రదేశ్ నగరం రియల్ ఎస్టేట్ రంగంలో దూసుకుపోతోంది. రాష్ట్రానికి హార్ట్ అయిన విశాఖపట్నంలో అయితే భూముల ధరలు ఒక్కసారిగా ఎగబాకాయి. వైజాగ్ కి ఏఐ డేటా సెంటర్ వస్తుందనే అంచనాల మధ్య భూముల రేట్లు అమాంతం పెరిగాయి. సామాన్యులకు అందుబాటులో లేని పరిస్థితి కూడా అక్కడ నెలకొంది. ఇప్పటిదాకా ఒక దశలో వరకు ఉన్న విశాఖపట్నం రియల్ ఎస్టేట్ మార్కెట్ ఇప్పుడు కొత్త దశలోకి అడుగుపెట్టింది. ఇక్కడ పురాతనంగా ఉన్న 5 నుంచి 15 అంతస్థుల నివాస భవనాల స్థానంలో.. ఇప్పుడు 40 నుంచి 50 అంతస్థుల హైరైజ్ అపార్ట్‌మెంట్ ప్రాజెక్టులు ఎక్కువగా నిర్మితమవుతున్నాయి. దీని ప్రధాన కారణం ఏంటంటే.. భూమి ధరల భారీ పెరుగుదల. చిన్న ప్లాట్లు ఉండకపోవడం.. ప్రధాన ప్రాంతాల్లో భూమి ఖరీదు ఎక్కువ స్థాయికి చేరడమే డెవలపర్లను ఎత్తైన భవనాల నిర్మాణానికి ప్రేరేపిస్తోందని చెప్పవచ్చు. విశాఖలో స్థల పరిమితులు అలాగే భూమి ధరల పెరుగుదల కారణంగా.. పెద్ద స్థాయి ప్రాజెక్టులకు మాత్రమే అందుబాటులో ఉంది. 5-15 అంతస్థుల ప్రాజెక్టులు నిర్మించడానికి భూమిని కొనడం ఆర్థికంగా కష్టతరమైంది కావడంతో డెవలపర్లు అటువైపు మొగ్గు చూపుతున్నారు. అందువలన హైరైజ్ అపార్ట్‌మెంట్ల నిర్మాణం ప్రధాన ఆప్షన్‌గా మారింది. భూమిని ఎక్కువ యూనిట్లుగా పంచి ప్రతి చదరపు అడుగు ధరను రూ. 1,000 నుంచి రూ. 1,500 మధ్య ఉంచడం.. అలాగే అమ్మకానికి తక్కువ ధరలో అందించడం కొనుగోలుదారులకు ఆకర్షణీయంగా మారుతుందని డెవలపర్లు చెబుతున్నారు. ఇంకో కారణం ఏంటంటే.. కొనుగోలుదారుల అభిరుచులు మారడం. ఈ రోజుల్లో నివాస అభ్యర్థులు కేవలం ఇళ్లను మాత్రమే కోరుకోవడం లేదు. పార్కింగ్, జిమ్, బేసిన్, క్లబ్ హౌస్ వంటి ఆధునిక సౌకర్యాలు ఉన్న అపార్ట్‌మెంట్లను కోరుతున్నారు. వీటిని వారు సాధించడం ఎక్కువగా హైరైజ్ ప్రాజెక్టులలోనే సాధ్యమవుతుంది. రూ. 16 వేల కోట్లతో రాయ్‌పూర్‌విశాఖపట్నం కారిడార్.. పూర్తిగా మారిపోనున్న వైజాగ్ రూపురేఖలు.. విశాఖలో ఇప్పుడు కొన్ని మైక్రోమార్కెట్లు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. అవేంటంటే.. మధురవాడకాపులుప్పాడ, ఆనందపురంకొమ్మాది, భోగాపురంభీమిలి, యెండాడరుషికొండ. ఈ ప్రాంతాల్లో రోడ్ల విస్తరణ, ట్రాఫిక్ మార్గాల అభివృద్ధి, ఆధునిక ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఏర్పాట్ల కారణంగా భూమి ధరలు రెండింతలు లేదా అంతకంటే ఎక్కువగానే పెరిగాయి. ఇప్పటికే విశాఖలో 35 అంతస్థుల అపార్ట్‌మెంట్‌లు నిర్మాణం కొనసాగుతున్నాయి. అదనంగా ఇండియన్ నేవీ 41 అంతస్థుల సైలోర్స్ బ్లాక్ నిర్మాణంలో ఉంది. స్థానిక ప్రజలు ఇళ్ల కోసం ఇంకా వెతుకుతున్నారు. అయితే ధరల పెరుగుదల వలన కొందరు తక్షణంగా కొనుగోలు చేసేందుకు ముందున్నారు.అనుబంధ రంగాల్లో వృద్ధి కూడా రియల్ ఎస్టేట్‌ను వేగవంతంగా ముందుకు తరలిస్తుంది. హైరైజ్ నిర్మాణం ద్వారా ఒక వైపు భూమి వినియోగ సామర్థ్యం పెరుగుతుండగా.. మరొక వైపు అందుబాటులో ఇళ్ల ధరలు తగ్గుతున్నాయి. ఇది వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరానికి సమన్వయంగా పనిచేస్తుందని రియల్ ఎస్టేట్ నిపుణులు చెబుతున్నారు. క్లుప్తంగా చెప్పాలంటే.. భూమి ధరలు పెరగడం, స్థల పరిమితులు,రంగ అభివృద్ధి, కొనుగోలుదారుల మారుతున్న అభిరుచులు కారణంగా విశాఖపట్నం రియల్ ఎస్టేట్ హైరైజ్, వర్టికల్ స్కైలైన్ వైపు పయనిస్తోంది. దూకుతోంది. నగరం భవిష్యత్తులో స్మార్ట్, ఎత్తైన నివాస భవనాల కేంద్రంగా మారబోతోంది. డిస్క్లైమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి. ఈ కథనాన్ని కేవలం సమాచారంగా మాత్రమే పరిగణించండి.

# ఒక్కసారి ఛార్జ్ చేస్తే రోజుల తరబడి

## రియల్‌మీ నుంచి పవర్‌ఫుల్ స్మార్ట్‌ఫోన్ లాంచ్!




స్మార్ట్‌ఫోన్ వాడేవారికి అతిపెద్ద సమస్య ఏదైనా ఉందంటే అది బ్యాటరీ త్వరగా అయిపోవడం. ఈ సమస్యకు చెక్ పెడుతూ ప్రముఖ మొబైల్ సంస్థ రియల్‌మీ తన నార్జో సిరీస్‌లో నార్జో పవర్ 5జీ అనే సరికొత్త మోడల్ ను భారత మార్కెట్లోకి విడుదల చేసింది. భారీ బ్యాటరీ, అదిరిపోయే పర్ఫార్మెన్స్ తో వచ్చిన ఈ ఫోన్ మార్చి 5 మధ్యాహ్నం 12 గంటల నుంచి అమెజాన్, రియల్‌మీ వెబ్‌సైట్ లో అందుబాటులోకి వచ్చింది. కళ్ళు చెదిరే ఫీచర్లు.. పవర్‌ఫుల్ పర్ఫార్మెన్స్ ఈ ఫోన్‌లో అందరినీ ఆకర్షిస్తున్న ప్రధాన ఫీచర్ దీనిలోని 10,001పాూష్ట్ర భారీ బ్యాటరీ. సాధారణంగా స్మార్ట్‌ఫోన్లలో 5,000పాూష్ట్ర బ్యాటరీ చూస్తుంటాం.. కానీ, దానికి రెట్టింపు సామర్థ్యంతో ఈ ఫోన్ రావడం విశేషం. ఇంత పెద్ద బ్యాటరీ ఉన్నా ఫోన్ బరువు కేవలం 219 గ్రాములు మాత్రమే ఉండటం గమనార్హం. దీనికి 80ఔ ఫాస్ట్ ఛార్జింగ్ సపోర్ట్ ఉంది, దీనివల్ల కేవలం 36 నిమిషాల్లోనే 50% బ్యాటరీ నిండుతుంది. అంతేకాదు దీనికి ఉన్న 'రివర్స్ ఛార్జింగ్' ఫీచర్ తో మీరు ఇతర ఫోన్లను కూడా ఛార్జ్ చేసుకోవచ్చు. గేమింగ్ కోసం చిప్.. డిస్‌ప్లే విషయానికి వస్తే.. ఇందులో 144ఎఓ రిఫ్రెష్ రేట్ కలిగిన స్క్రీన్ ను అందించారు. ఎండలో కూడా స్పష్టంగా కనిపించేలా 6500 నిట్స్ పీక్ బ్రైట్‌నెస్ దీని సొంతం. గేమింగ్ ప్రియుల కోసం ఇందులో మీడియాటెక్ ప్రాసెసర్‌ను వాడారు. దీనికి తోడు అదనపు చిప్ ఉండటం వల్ల గేమ్స్ ఆడుతున్నప్పుడు ఫోన్ హ్యాంగ్ అవ్వకుండా స్మూత్‌గా పనిచేస్తుంది. దుమ్ము, నీటి నుంచి రక్షణ కోసం దీనికి 69 రేటింగ్స్ కూడా ఇచ్చారు. ఇది నిజంగా బెస్ట్ బడ్జెట్ బ్యాటరీ ఫోనా? ప్రస్తుతం మార్కెట్లో రూ. 25,000 లోపు లభిస్తున్న ఫోన్లను గమనిస్తే.. ఇంత భారీ బ్యాటరీ సామర్థ్యం ఉన్న ఫోన్ మరొకటి లేదనే చెప్పాలి. సాధారణంగా ఎక్కువ బ్యాటరీ ఉంటే ఫోన్ లావుగా, బరువుగా ఉంటుంది. కానీ, రియల్‌మీ సిలికాన్ ఆనోడ్ టెక్నాలజీని వాడి దీనిని స్టైలిష్‌గా రూపొందించింది. రూ. 23,999 ప్రారంభ ధరతో, 4 ఏళ్ల బ్యాటరీ వారంటీ , రూ. 3,999 విలువైన లాంచ్ ఆఫర్లను కలుపుకుంటే.. ఇది ఒక వాల్యూ ఫర్ మనీ డీల్ అనిపిస్తుంది. ముఖ్యంగా ఛార్జింగ్ పెట్టే తీరిక లేకుండా నిరంతరం ట్రావెలింగ్ చేసేవారికి, గంటల తరబడి గేమింగ్ ఆడేవారికి, వీడియోలు చూసేవారికి ఇది ప్రస్తుతానికి మార్కెట్లో ఉన్న అత్యుత్తమ 'బడ్జెట్ బ్యాటరీ ఫోన్' అని నిస్సందేహంగా చెప్పవచ్చు. ధర.. లభ్యత.. ఇక ధరల విషయానికొస్తే.. ఈ ఫోన్ రెండు వేరియంట్లలో లభిస్తుంది. 8GB/128GB/ వేరియంట్ ధర రూ. 23,999 కాగా, 8GB/256GB/ మోడల్ కూడా అందుబాటులో ఉంది. టైటాన్ సిల్వర్, టైటాన్ బ్లూ రంగుల్లో మెరిసిపోతున్న ఈ ఫోన్ నేటి నుంచే అమ్మకానికి సిద్ధంగా ఉంది.



